సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

కొండదేవతమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: త్రినాథపురం గ్రామదేవత కొండదేవతమ్మ పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు వేకువజాము నుంచే తరలివచ్చి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి సంఘం అధ్యక్షుడు జూరెడ్డి గంగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు సింగవరపు సత్యనారాయణ, సూర్యనారాయణ, మధు, కనకారావు తదితరులు పాల్గొన్నారు.

మర్యాద పూర్వక కలయిక



సీఐను సత్కరిస్తున్న కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు

సింధియా: మల్కాపురం సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన గొలగాని అప్పారావును మంగళవారం 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో నాయకులు వరపల మహేష్, దండి శ్యామ్, గుండపు అశోక్, గంటా వర్మ, జై ప్రకాష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వీధిలైట్ల ఏర్పాటుకు చర్యలు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హిమాచల్ నగర్ కొండ ప్రాంతంలో మంగళవారం నాయకులు పర్యటించారు. మూడు వారాల నుంచి ఎగువ మెట్ల మార్గం వద్ద లైట్లు వెలగడం లేదని స్థానికులు వివరించారు. కూటమి నాయకుడు పుర్రె సురేష్‌యాదవ్ మాట్లాడుతూ బుధవారం వెలగని వీధిలైట్ల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయిస్తామని చెప్పారు.

40 కేజీల నిషేధిత ప్లాస్టిక్ పట్టివేత



ప్లాస్టిక్ కవర్ల అమ్మకందారులపై దాడులు చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

జగదాంబ: నిషేధిత ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తున్న వ్యాపార సముదాయాలపై జీవీఎంసీ ప్రతేక బృందాలు దాడులు చేసి 40 కేజీల నిషేధిత ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్నాయి. మంగళవారం జీవీఎంసీ 35వ వార్డు పూర్ణా మార్కెట్‌లో హోల్‌సేల్ ప్లాస్టిక్ దుకాణాలపై దాడులు చేశారు. ఈ మేరకు ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు మాట్లాడుతూ మానవాళికి హాని కలిగించే ప్లాస్టిక్‌పై జీవీఎంసీ నిషేధం విధించిందన్నారు. అయినప్పటికీ వ్యాపారులు ప్లాస్టిక్ ఉపయోగిస్తూనే ఉన్నారన్నారు. దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు దొరికితే వెంటనే ఆయా దుకాణాల ట్రేడ్ లైసెన్సులు రద్దు చేయడంతో పాటు అపరాధ రుసుము విధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ మురళి, గంగాధర్, రంగరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోర్ట్ కలాసీలకు టైం స్కేల్ అమలుకు హామీ



పోర్టు కార్యాలయం ముందు హర్షం వ్యక్తం చేస్తున్న యూనియన్ నాయకులు, కలాసీలు

జగదాంబ: విశాఖ పోర్ట్ పూల్ కలాసీలకు టైం స్కేల్ అమలు చేస్తామని పోర్ట్ చైర్మన్ హామీ ఇచ్చారని పూల్ కలాసీల జిల్లా అధ్యక్షుడు పరుశురామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మంగళవారం పోర్టు పూల్ కలాసీలతో కలిసి చైర్మన్‌తో మాట్లాడి వినతి పత్రం అందజేశారు. కలాసీలు పోర్ట్‌ను నమ్ముకుని చాలా కాలంగా జీవిస్తున్నారని తెలిపారు. వారందరికీ టైం స్కేల్, మెడికల్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన చైర్మన్ కలాసీలకు టైం స్కేల్ అమలు చేస్తామని హామీ ఇవ్వడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ నిరుద్యోగ సంఘం రాష్ట్ర అధ్యకుడు హేమంత్‌కుమార్, జుంజూరు గోవింద్, యూనియన్ నాయకులు రాము, రమేష్, భీమ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మో.. ఆ రోడ్డులో ప్రయాణమా!





హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద ప్రధాన రహదారిపై పార్కింగ్ చేసిన భారీ వాహనాలు

- మల్కాపురం–సింధియా రోడ్డులో భారీ వాహనాల పార్కింగ్
- నిత్యం నరకం చూస్తున్న వాహనచోదకులు
- పరిశ్రమలకు కరువైన పార్కింగ్ స్థలం

సింధియా: మల్కాపురం నుంచి సింధియా వెళ్లే ప్రధాన రహదారిలో ప్రయాణమంటే ప్రజలు హడలెత్తిపోతున్నారు. ఆ మార్గంలో ప్రయాణం ప్రమాదమని తెలిసినా ప్రత్యామ్నాయం లేక రాకపోకలు సాగిస్తున్నామని వాహనదారులు వాపోతున్నారు.

పార్కింగ్ స్థలం చూపని సంస్థలు

ఈ పరిశ్రమలకు ఎగుమతి, దిగుమతుల కోసం వచ్చే భారీ వాహనాలను నిలిపేందుకు పార్కింగ్ స్థలం కరువైంది. పరిశ్రమలకు వచ్చే భారీ వాహనాలకు పార్కింగ్ స్థలాన్ని కేటాయించాల్సిన బాధ్యత పరిశ్రమలపై ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. పార్కింగ్ వసతి లేక వందల కిలోమీటర్లు ప్రయాణం చేసి వస్తున్న వాహనదారులు సైతం తీవ్ర అవస్థలు పడుతున్నారు.

రోజుల తరబడి పార్కింగ్ చేయడంతో..

పరిశ్రమలకు వచ్చే భారీ వాహనాలను రోజుల తరబడి రోడ్డుపైనే పార్కింగ్ చేసి ఉంచడంతో వాహనాదారులు రోడ్ల మీదే స్నానపానాలు, వంటావార్పు వంటి దైనందిన కార్యకలాపాలు చేస్తున్నారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే సాధారణ ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. ఈ మార్గంలో వీధి దీపాలు సైతం సరిగ్గా వెలగకపోవడంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. చీకట్లో ప్రయాణిస్తూ రోడ్డుపై పార్కింగ్ చేసిన భారీ వాహనాలను గుర్తించలేక ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు.

జరిమానాలు విధిస్తున్నా..

రోడ్డుపై పార్కింగ్ చేసి ఉంచుతున్న భారీ వాహనాలకు ఎప్పటికప్పుడు జరిమానాలు విధిస్తున్నా వాహనదారుల్లో మాత్రం మార్పు రావడంలేదని ట్రాఫిక్ పోలీసులు సైతం చెబుతున్నారు. పరిశ్రమల యాజమాన్యాలతో సంప్రదింపులు జరిపి పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తలలు పట్టుకుంటున్నారు.

ఇదీ పరిస్థితి

గాజువాక నుంచి శ్రీహరిపురం, మల్కాపురం **మీదుగా సింధియా వెళ్లే రోడ్డు నిత్యం రద్దీ**గా ఉంటుంది. **అయితే శ్రీహరిపురంలో కోరమాండల్** ఫెర్టిలైజర్స్, మల్కాపురంలో హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ వంటి పరిశ్రమలకు నిత్యం మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆ వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేసి రోజుల తరబడి ఉంచుతుండడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించి స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

తరచూ ఇబ్బంది



మల్కాపురం నుంచి సింధియా వరకు ప్రధాన రహదారిపై పరిస్థితి దారుణంగా ఉంటుంది. పరిశ్రమలకు వచ్చే భారీ వాహనాలను పార్కింగ్ చేసి ఉండడంతో సాధారణ వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. భారీ వాహనాలను రోజుల తరబడి పార్కింగ్ చేసి వదిలేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తడమే కాకుండా చుట్టపక్కల ఉంటున్న వారికి సైతం సమస్యగా మారుతోంది.

– దేబార్కి పండు, మల్కాపురం

భారీ వాహనాలను నిరోధించాలి



మల్కాపురం నుంచి సింధియా వరకు ప్రధాన రహదారిపై భారీ వాహనాలు పార్కింగ్ చేయకుండా చెక్ పెట్టాలి. రాత్రి వేళ ఈ మార్గంలో ప్రయాణమంటే భయపడి ఆగిపోతున్నాం. వీధిలైట్లు సైతం లేకపోవడంతో ప్రమాదాలు జరిగి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నాం. పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యంతో సతమతమవుతుంటే, మరో పక్క భారీ వాహనాలు నిలిపి ఉంచడంతో ప్రమాదాలు జరిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. జీవీఎంసీ, రహదారిభద్రత, ట్రాఫిక్ పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలి.

–గంటా వర్మ, ఏకేసీకాలనీ

చర్యలు తీసుకుంటున్నాం

రోడ్డుపై పార్కింగ్ చేస్తున్న భారీ వాహనాలకు జరిమానాలు విధిస్తున్నాం. సంచార వాహనాల ద్వారా నిత్యం అవగాహన కల్పిస్తున్నాం. పరిశ్రమల యాజమాన్యలతో మాట్లాడి పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపడుతున్నాం. ప్రజల్లో సైతం చైతన్యం వచ్చే దిశగా నిత్యం అవగాహన సదస్సులు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నాం.

– షణ్ముఖరావు, ట్రాఫిక్ సీఐ, మల్కాపురం

పారిశుధ్య ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివి

మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



అప్పారావు దంపతులను సత్కరిస్తున్న శ్రీధర్ తదితరులు

విశాఖ విద్య: ప్రజారోగ్య సంరక్షణలో పారిశుధ్య ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని నగర పాలక సంస్థ మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. పారిశుధ్య విభాగంలో సూపర్‌వైజర్ పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన డి.కె.అప్పారావును వార్డు పరిధిలోని కార్మికులంతా మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ వార్డు పరిధిలో కార్మికులందరినీ సమన్వయం చేసుకుంటూ మంచి సేవలు అందించిన అప్పారావు అందరికీ స్ఫూర్తిగా నిలుస్తారన్నారు. అదేవిధంగా మలేరియా విభాగంలో విశిష్ట సేవలందించిన ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన సూర్యప్రకాశ్‌రావు సేవలు అభినందనీయమని ఆయన శేష జీవితం ఆనందకరంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జీవీఎంసీ పారిశుధ్య విభాగం, మలేరియా విభాగం అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

లక్ష్యం ఉంటే విజయం తథ్యం



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న అతిథులు

మల్కాపురం: లక్ష్యంతో పని చేస్తే విజయంవరిస్తుందని ఎస్.ఎన్.ఎస్ స్కూల్ ఉపాధ్యాయురాలు వి.పద్మజ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. విజయ సాధనకు భావవ్యక్తీకరణ,ఇతరులతో సత్సంబంధాలు ఎంతో అవసరం అని చెప్పారు. ప్రతి ఒక్కరూ సవాళ్లను అధిగమించి,నిరంతం నైపుణ్యానికి పదును పెట్టినప్పుడే అనుకున్న లక్ష్యాన్ని సులభంగా చేరుకోగలరని అన్నారు. గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రముఖులు అందిస్తున్న సందేశాలను బాలలు నిత్య జీవితంలో ఆచరణలో పెట్టాలని సూచించారు. విద్యార్థులకు చిత్రలేఖనం, నీతి కథల బోధన,ఇంగ్లిష్‌లో మాట్లాడడం వంటి కార్యక్రమాలతో పాటు చిన్నారులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్ నోడల్ అధికారి ఈ.పి.ఎస్.భాగ్యలక్ష్మి,వై.అనసూయాదేవి, మహిళ నాయకురాలు జగదాంబ,యూత్ లీడర్లు జ్యోతిర్మయి,సునీత,నితీష్ తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ ఎంట్రీలో లోపాలు సవరించాలని వినతి



పీఎఫ్ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న భెల్ సీఐటీయూ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: భెల్ ట్రెనింగ్ సెంటర్‌లో మంగళవారం పీఎఫ్ (అదాలత్) నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ సీఐటీయూ ప్రధానకార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ 1992 నుంచి వివిధ సిరీస్‌లో జాయిన్ అయిన ఉద్యోగులకు డేట్ ఆఫ్ జాయినింగ్ సరిగ్గా లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీనికి కారణం పీఎఫ్ అధికార యంత్రాంగమే అన్నారు. వెంటనే అధికారులు స్పందించి ఉద్యోగుల డేట్ఆఫ్ జాయినింగ్ సరిచేసి తగిన విధంగా పెన్షన్ వచ్చేలా చేయాలని కోరారు. అలాగే సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రిటైర్ అయిన ఉద్యోగులకు రావాల్సిన హయ్యర్ పెన్షన్ రాలేదని, ఆ పెన్షన్లు అప్‌ప్లై చేసిన ఉద్యోగులకు రిటైర్ అయినట్లు మెయిల్స్, మెసేజ్‌లు వచ్చాయని, ఇది చాలా దుర్మార్గమైన చర్య అని అన్నారు. భెల్ ఇతర యూనిట్లలో హయ్యర్ పెన్షన్ వస్తుందని, విశాఖపట్నం యూనిట్లో రాకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలపై పీఎఫ్ అధికారులు విశ్వనాథ్, వైభవ్, శివశంకర్ తదితర అధికారులకు సీఐటీయూ నాయకులు జి.టి.పి.ప్రకాష్, సీతన్నాయుడు, ఎస్.జగన్నాథరావు వినతి పత్రాన్ని అందజేశారు.

యోగా వేడుకల ప్రాంగణం పరిశీలన



యోగా వేడుకలు జరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎం.టి.కృష్ణబాబు

ఏయూక్యాంపస్: అంతార్జాతీయ యోగా వేడుకలు జరగనున్న బీచ్ రోడ్డు ప్రాంతాన్ని ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు మంగళవారం ఉదయం సందర్శించారు. ప్రధాన కార్యక్రమం జరిగే ఆర్కే బీచ్ ప్రాంగణం, ఇతర కంపార్ట్‌మెంట్లు నిర్మించే ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమ ప్రణాళిక, నిర్వహణ విధానాన్ని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ స్వయంగా వివరించారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు దారుణం



మాట్లాడుతున్న దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్

సీతంపేట: దళితుల బడ్జెట్ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీరని అన్యాయం చేశాయని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం జరిగిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ జిల్లాలో మూడు లక్షల మంది ఎస్సీ జనాభా ఉంటే, ఎస్సీ కార్పొరేషన్ యూనిట్లు కేవలం నాలుగు వందల యూనిట్లు కేటాయించడం సిగ్గుచేటని మండిపడ్డారు. మంత్రులు ఉన్న నియోజకవర్గాలలో దళితులపై దాడులు విపరీతంగా జరుగుతున్నాయని, పిఠాపురం, పాయకరావుపేట, తెనాలి నియోజకవర్గాల్లో దళితులపై దాడులు జరిగాయన్నారు. దళితులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేసారు. దళితుల రక్షణకు ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

బీఆర్‌టీఎస్ రోడ్డులో విరిగిన బారియర్

- తప్పిన పెను ప్రమాదం
- రాకపోకలకు తీవ్ర అంతరాయం



రోడ్డుపై పడిన బారియర్



బారియర్‌ను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

విశాఖ విద్య: ఎన్ఏడీ–గోపాలపట్నం బీఆర్‌టీఎస్ రోడ్‌లో భారీ వాహనాలను నియంత్రించే క్రమంలో ఏర్పాటు చేసిన హైగేజ్ బారియర్ విరిగిపడింది. సోమవారం అర్ధరాత్రి వేళ ఆ దారిలో వచ్చిన గుర్తుతెలియని వాహనం బారియర్‌ను ఢీ కొట్టడంతో అది రోడ్డుకు అడ్డంగా పడింది. బారియర్‌ను ఢీ కొట్టిన వాహనం అక్కడ నుంచి వెళ్లిపోయింది. ట్రాఫిక్ లేని సమయం కావడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే దారికి అడ్డంగా బారికేడ్ పడడంతో గోపాలపట్నం నుంచి ఎన్ఏడీ వైపు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బీఆర్‌టీఎస్ రోడ్‌లో ట్రాఫిక్ రద్దీని గుర్తించిన పోలీసులు హుటా హుటిన అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. రోడ్డుకు అడ్డంగా పడిన బారియర్‌ను పొక్లెయినర్‌తో తొలగించారు. అయితే బీఆర్‌టీఎస్ రోడ్డులో గతంలోనూ ఇదే రీతిన జరిగింది. మరోమారు ఇలా జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

వీడని పశువుల గోల



మల్కాపురం పల్లివీధిలో పశువుల సంచారం



వీధిలో నీళ్ల బకెట్‌ను చెదరగొడుతున్న ఆవు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు పరిధిలో పశువుల గోల వదలడం లేదు. ఇవి పగులు,రాత్రి అన్న తేడా లేకుండా వీధుల్లో సంచరించడంతో మహిళలు, పిల్లలు భయపడుతున్నారు. ప్రధానంగా మల్కాపురం ప్రాంతంలో పలువురు పశువుల పెంపకం దార్లు ఆవుల నుంచి పాలను సేకరించిన తర్వాత పశువులశాలలో పెట్టాల్సింది పోయి విచ్చల విడిగా వదిలేస్తున్నారు. దీంతో వీధుల్లో సంచరిస్తూ పప్పు దినుసులు,ఇతర పదార్థాలు బయట ఆరబెడితే వాటిని తింటూ అక్కడే మల,మూత్ర విసర్జన చేస్తున్నాయి. సమస్యపై అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదని మహిళలు వాపోతున్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భలే మంచి రో‘జూ’



ఆకలి వేస్తుంది ఆహారం పెట్టు అంటూ నోరు తెరిచిన నీటి ఏనుగు



ఎవరికి దొరికితే వారికే చేప అంటూ పోటీ పడుతున్న ఘరియల్ మొసలి, కొంగలు



నోట కరిచిన చేపతో ఘరియల్ మొసలి



ఖడ్గమృగం కొలనులో చేపలు కోసం వెతుకుతున్న పెయింటెడ్ స్టోక్ పక్షులు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూపార్క్ కళకళలాడింది. ఒకవైపు చిన్నారులు విత్తన బంతులు వేస్తూ సందడి చేస్తుంటే, సందర్శకులతో జూ అంతా కోలాహలంగా మారింది. జూలో జంతువుల చేష్టలు చూపరులను కట్టిపడేశాయి. ఏనుగులు తొండంతో గోడ దగ్గరకు రావడం పిల్లలు కేరింతలు కొట్టారు. వాతావరణం చల్లగా ఉండడంతో జంతువులు మరింత ఉత్సాహంగా కనిపించాయి. ఖడ్గమృగం నీటిలో మునిగి తేలుతూ ఉంటే, ఒడ్డున నిలబడిన రంగుల పెయింటెడ్ స్టార్క్స్ పక్షులు చేపల కోసం గంటల తరబడి ఎదురుచూడటం ఆసక్తికరంగా అనిపించింది. అంతేకాదు ఆహారం తీసుకొచ్చిన జూ సిబ్బందిని చూడగానే నీటి ఏనుగు నోరు తెరిచి ఆకలిగా ఉందని సైగలు చేస్తూ అందరినీ నవ్వించింది. ఇక మొసళ్ల కొలనులోనైతే అసలు సిసలు పోటీ ఏర్పడింది. సిబ్బంది వేసిన చేపల కోసం ఘరియల్ మొసళ్లు, కొంగలు పోటీ పడి ఎవరికి దొరికితే వారిది అన్నట్లుగా ఎదురుచూశాయి. మొత్తానికి ఇందిరాగాంధీ జూపార్క్ సందర్శకులకు మంచి వినోదాన్ని పంచింది.